పత్తి సాగుపై అన్నదాతల ఆసక్తి

ఈ ఏడాది ఆత్మకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని రైతులు విస్తారంగా పత్తి పంట సాగు చేపడుతున్నారు. గతేడాది పత్తి ధరలు బాగా పలకడంతో రైతులకు లాభాలు వచ్చాయి. ఈ ఏడాది పత్తి ధరలు బాగుండడంతో పత్తి పంట సాగువైపు రైతులు మొగ్గుచూపుతున్నారు. బోర్లలో సమృద్ధిగా నీరు ఉండడంతో మెట్టభూముల్లో ఇప్పటికే సాగుచేపట్టగా..మాగాణి భూముల్లో వరికోతలు పూర్తి చేసిన రైతులు సైతం రెండో పంటగా పత్తి సాగుకు సన్నద్ధమవుతున్నారు.


వెన్నవాడలో సాగుచేసిన పత్తి పంట

ఆత్మకూరురూరల్: ఈ ఏడాది ఆత్మకూరు వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో సాగునీరు సమృద్ధిగా ఉండడంతో ప్రతి గ్రామంలోనూ రైతన్నలు సాగును పండగలా చేపట్టారు. సోమశిల ఉత్తర కాలువ ఆయకట్టుతో పాటు భూగర్భజలాలు సమృద్ధిగా ఉండడంతో మెట్టభూముల్లో సైతం విస్తారంగా పంటల సాగు చేపట్టారు. రబీ పంట కోత దశకు రావడంతో రైతులు, రైతు కూలీలతో గ్రామాలు సందడిగా ఉన్నాయి. సోమశిల ఉత్తర కాలువ కింద ముందస్తుగా వరికోతలు చేపట్టిన రైతులు ధాన్యం అమ్ముకునేందుకు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ధాన్యం ధరలు ఆశాజనకంగా ఉండడం...ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మరో వారంలో ఏర్పాటు చేయనుండడంతో కొందరు రైతులు వ్యాపారులకు ధాన్యం విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ఉత్సాహం చూపుతున్నారు.

విస్తారంగా పత్తి సాగు

గతేడాది ఎన్నడూ లేని విధంగా క్వింటా పత్తి రూ.9వేల నుంచి రూ.14వేల వరకు పలికింది. దీంతో రైతులు లాభాలు ఆర్జించారు. ప్రస్తుతం క్వింటా రూ.6వేలకు పైగా పలుకుతోంది. దీంతో వరి కోతలు పూర్తి చేసిన రైతులు పత్తి పంట సాగు చేపట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పంటమార్పిడితో ప్రయోజనాలు ఉంటాయని వ్యవసాయాధికారులు సూచిస్తుండడంతో పత్తి సాగు వైపు మొగ్గుచూపుతున్నారు. వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని మెట్టభూముల్లో ఇప్పటికే రెండు వేల ఎకరాల్లో పత్తి పంట సాగుచేపట్టారు. మార్చి నెలాఖరులోగా మరో 3వేల ఎకరాల్లో సాగుచేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఆత్మకూరు మండలంలోని మెట్ట ప్రాంతాలైన వెన్నవాడ, గండ్లవేడు, పడకండ్ల, యర్రబల్లి, ఆరవీడు, బోయలచిరివెళ్లతో పాటు ఉత్తరకాలువ ద్వారా సాగునీరు అందే మహిమలూరు, రామస్వామిపల్లి, వాశిలి, తదితర గ్రామాల్లోనూ అధికంగా సాగు చేపడుతున్నారు. ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలోని రైతులు పత్తిని దళారుల ద్వారా గుంటూరు, పత్తిపాడు, ప్రొద్దుటూరు, తదితర యార్డులకు తరలించి విక్రయించుకోవడం ఇప్పటి వరకు ఆనవాయితీగా ఉంది. అయితే ఈ ఏడాది రైతుల అభిప్రాయాలకు అనుగుణంగా వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొత్తగా పత్తి కొనుగోలుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ దిశగా ప్రభుత్వం చొరవచూపితే పత్తికి గిట్టుబాటు ధర లభిస్తుందని పత్తి రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

విస్తారంగా పత్తి పంట సాగు



గతంలో వర్షాలు సక్రమంగా పడక భూగర్భజలాలు అడుగంటి పొలాలు బీళ్లు పెట్టుకోవాల్సి వచ్చింది. గత మూడేళ్లగా సకాలంలో వర్షాలు పుష్కలంగా కురుస్తుండడంతో రైతులు పండగలా సాగుచేపడుతున్నారు. గతేడాది ఎన్నడూ లేని విధంగా పత్తి ధరలు పలకడంతో రైతులు లాభపడ్డారు. ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండడంతో మెట్ట, మాగాణి భూముల్లో రైతులు విస్తారంగా పత్తి సాగు చేపడుతున్నారు.

– కోటంరెడ్డి సుబ్బారెడ్డి, రైతు, వెన్నవాడ

రైతులకు అండగా ప్రభుత్వం



ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలోని రైతులు రెండో పంటగా పత్తి సాగుచేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. గతేడాది పత్తి ధరలు బాగుండడంతో పత్తి పంట లాభదాయకమని రైతులు భావిస్తున్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు పత్తి పంట సాగుకు అవసరమైన సూచనలు, సలహాలు అందజేస్తున్నాం. పత్తి సాగుకు అవసరమైన ఎరువులు, పురుగుమందుల పంపిణీకి చర్యలు తీసుకుంటున్నాం.

– దేవసేన, ఏడీఏ,ఆత్మకూరు

అడవుల సంరక్షణపై అవగాహన

ఉదయగిరి: అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎఫ్‌బీఓలు అన్నారు. ఉదయగిరి రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని పలు అటవీ బీట్‌ల పరిధిలోని గ్రామస్తులు ఎఫ్‌బీఓలు బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. వెంగళరావునగర్‌లో జరిగిన అవగాహన సదస్సుల్లో గండిపాళెం బీట్ ఎఫ్‌బీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అడవులకు నిప్పు పెట్టడం నేరమన్నారు. వన్యప్రాణులు దాహంతో గ్రామాల్లోకి వస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. అటవీ శాఖ నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అటవీ ప్రాంత సమీప గ్రామాల్లో ఫ్లెక్సీలు ఏర్పాటుచేశారు.


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌బీఓ వెంకటేశ్వర్లు

అపెడాలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కావలి: మామిడి రైతులు అధిక రాబడుల కోసం అగ్రికల్చర్ అండ్ ప్రాసెస్డ్ ఫుడ్ ప్రాడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ (అపెడా)లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని కావలి ఉద్యాన శాఖ అధికారిణి ఎం సుధామయి సూచించారు. మండలంలోని సిరిపురంలో సాగుచేస్తున్న మామిడి తోటలను బుధవారం ఆమె పరిశీలించారు. పూత, పిందె దశలోని తోటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. తామర, తేనెమంచు పురుగు, మసి తెగుళ్ల నివారణకు స్పైనోసాడ్ 3 మి.లీ.మందును 10 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేయాలని వివరించారు. నాణ్యత కలిగిన మామిడి పండ్లకు అంతర్జాతీయ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుందన్నారు. విదేశాలకు పండ్ల ఎగుమతికి అపెడా రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఉద్యాన పంటలకు సంబంధించిన సమాచారం కోసం రైతులు 79950 86950 నంబరులో సంప్రదించాలని కోరారు.


రైతులకు సూచనలిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి సుధామయి

సులభరీతిలో బోధన చేయాలి

ఉదయగిరి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సులభరీతిలో బోధన చేయాలని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కొండాయపాళెం, వెంకట్రావుపల్లి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థి వర్క్‌బుక్‌లను పూర్తిచేసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు.


విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఈఓ మస్తాన్‌వలి

సచివాలయంలో తనిఖీలు



సీతారామపురం: స్థానిక బిట్–2 సచివాలయాన్ని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి పింఛన్ల పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది సమయాన్ని పాటించాలని సూచించారు. ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.

వీధి దీపాల ఏర్పాటు

ఆత్మకూరురూరల్: వాశిలి పంచాయతీ పరిధిలో వీధిదీపాలను బుధవారం ఏర్పాటు చేశారు. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో వీధి దీపాలు కాలిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సర్పంచ్ చెలిక రమాహరిబాబు వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

అపస్ రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు

ఆత్మకూరు: నెల్లూరులోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఈ నెల 5 నుంచి రెండ్రోజుల పాటు జరగనున్న ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ కార్యవర్గ సభ్యుడు అనిల్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర మహాసభలకు హాజరయ్యే ఉపాధ్యాయుల కోసం ఆ దివారం ఉదయం 7 గంటలకు ఆత్మకూరు బైపాస్ రో డ్డులోని రవితేజ కళ్యాణ మండపం వద్ద నుంచి రెండు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

నేడు వైకేపీ సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని త్రికోటేశ్వర కల్యాణ మండపంలో డీఆర్డీఏ పీడీ కేఈ సాంబశివారెడ్డి గురువారం ఉదయం 10 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌కేపీ ఏపీఎం బీ వెంకమ్మ బుధవారం తెలిపారు. ఆత్మకూరు క్లస్టర్ పరిధిలోని వైకేపీ అధికారులు, సిబ్బంది తప్పక హాజరుకావాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

కలిగిరి: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మెట్టుకూరు శిరీష అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆర్ కణాధర్ రావు బుధవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, మండలాధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి ఓటరు స్లిప్పుల పంపిణీ

ఉదయగిరి: ఈ నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటర్లకు బీఎల్వోల ద్వారా గురువారం నుంచి ఓటరు స్లిప్పులు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ సానా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో 1,390 మంది పట్టభద్రులు ఉన్నారని తెలిపారు. 116 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని వివరించారు. పట్టణంలోని దళితవాడ ప్రాథమిక పాఠశాలలో 68,135,136 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బైక్ అపహరణ

ఆత్మకూరు: పట్టణంలోని బీఎస్సార్ ఆస్పత్రి వద్ద పార్కింగ్ చేసిన బైక్‌ను అపహరించిన ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయిప్రసాద్ తెలిపారు. ఇటీవల పట్టణానికి చెందిన అబ్దుల్‌వాహెబ్ తన సమీప బంధువు బీఎస్సార్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా పరామర్శించేందుకు బైక్‌పై వెళ్లాడు. ఆస్పత్రి ఎదుట బైక్‌ను పార్క్ చేసి లోపలికి వెళ్లి వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో పలు చోట్ల విచారణ చేసిన బైక్ దొరకకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సంతాపం

వింజమూరు: నేరేడుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గురజాల వీరయ్య(68) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆయన మృతిపై ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి సంతాపం తెలిపారు.

ప్రమాదాల నివారణకు ఫేస్‌వాష్



ఆత్మకూరు: నెల్లూరు–ముంబయి జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ఆత్మకూరు సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం అర్ధరాత్రి ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని ఎస్సై ఎం శివశంకర్‌రావు తన సిబ్బందితో కలిసి నెల్లూరుపాళెం కూడలిలో వాహనాలను నిలిపి డ్రైవర్లతో ఫేస్‌వాష్ చేయించారు. అర్ధరాత్రి వేళ జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి


ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

• కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కారానికి బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. అల్లూరు, నార్త్‌మోపూరు, సింగపేట గ్రామాలను నగర పంచాయతీగా చేయడంతో ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు విన్నవించారు. ప్రధానంగా ఉపాధి పనులు, సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోతున్నామని వాపోయారు. తమ ప్రాంతాల్లో ఎక్కువగా ఎస్టీ కాలనీలు ఉన్నందున నగర పంచాయతీ నుంచి పంచాయతీగా మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ సమస్య తన దృష్టికి వచ్చిందని, దీనిపై అధికారులతో చర్చించడం జరిగిందన్నారు. త్వరలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇకపై వారానికి ఒక రోజు అల్లూరు మండలంలో పర్యటిస్తానని, ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని కోరారు. అల్లూరు మండలంలోని తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు త్వరలో రూ.73 కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, కరెంట్ స్తంభాలు, తదితర సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ ఏడాది రెండో పంటకు సాగునీరు సమృద్ధిగా ఉందన్నారు. మండలంలోని రైతులు రెండో పంట సాగుకు సిద్ధపడితే వెంటనే చెరువులను సాగునీటితో నింపేందుకు కృషి చేస్తామన్నారు. అల్లూరులో ఆవుల సమస్య ఎక్కువగా ఉందని తమ దృష్టికి వచ్చిందని, ఆవుల యజమానులు ఇళ్ల వద్దనే సంరక్షించుకోవాలని, రోడ్లపైకి ఆవులను వదిలితే గోశాలకు తరలిస్తామన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ ఫణికుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండాకృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్‌చైర్మన్ ఊటు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు నీలం సాయికుమార్, మేడా కృష్ణారెడ్డి, దైవాదీనం, సాధిక్‌రెడ్డి, మధురెడ్డి, సామంతుల సురేష్‌రెడ్డి, గోళ్ల రాజేష్, నిమ్మల భాస్కర్, తాండ్రమల్లి, చెంతాటి కరుణాకర్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినికి అభినందన

అల్లూరు: స్థానిక మహాత్మజ్యోతిబాపూలే గురుకుల పాఠశాల విద్యార్థిని శ్రీదివ్య రాష్ట్రస్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభకనబర్చింది. ఈ నెల 28న మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో విద్యావైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. అందులో శ్రీదివ్య ప్రదర్శించిన స్త్రీఆత్మనిర్భరత జాకెట్ అనే ప్రాజెక్ట్ ద్వితీయ బహుమతి పొందినట్లు గురుకులం ప్రిన్సిపల్ వీవీ రమణప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించి అభినందించారు.


శ్రీదివ్యను అభినందిస్తున్న ప్రిన్సిపల్

గ్రిగ్ పోటీల విజేతలకు అభినందన



చేజర్ల: ఆత్మకూరు జోన్‌స్థాయి గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీల్లో సత్తా చాటిన చేజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను బుధవారం అభినందించారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ అల్లం స్వప్న ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చేజర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడాకారుల విజయానికి కృషి చేసిన పీడీ మల్లికార్జునరావును సన్మానించారు. స్కూల్ హెచ్‌ఎం హైమావతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


ఉదయగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు


జలదంకిలో బీజేపీ నాయకుల ప్రచారం

ఉదయగిరి: పట్టణంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని బుధవారం ముమ్మరంగా నిర్వహించారు. తూర్పురాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎల్‌సీ రమణారెడ్డిని గెలిపించాలని కోరుతూ ఏపీటీఎఫ్, బీటీఏ, సీసీఎస్ జిల్లా నాయకులు ఎస్కే ఎండీ ఖాజా, జ్యోతి శ్రీనివాసులు, రామకృష్ణ విస్తృత ప్రచారం చేపట్టారు. ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, ఓబులేసు, షబ్బీర్, కృష్ణారెడ్డి, మాధవరాజు, ఓబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జలదంకి: తూర్పురాయలసీమ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పట్టభద్రుల అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, ఉపాధ్యాయ అభ్యర్థి కుట్టుబోయిన బ్రహ్మనందాన్ని గెలిపించాలని బీజేపీ నాయకులు కోరారు. జలదంకిలో బీజేపీ మండలాధ్యక్షుడు మారెళ్ల బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిట్టా వంశీకృష్ణ, నాయకులు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి, ముడి కిషోర్‌రెడ్డి, రాకేష్‌రెడ్డి, బాలకోటయ్య, ప్రవీణ్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

85 శాతం పింఛన్ల పంపిణీ


ఆత్మకూరులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో తొలిరోజైన బుధవారం 85 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం రమేష్‌బాబు తెలిపారు. మున్సిపల్ పరిధిలో 3,407 పింఛన్లు ఉండగా, తొలిరోజు 2,900 మందికిపైగా లబ్ధిదారులకు వలంటీర్లు పింఛన్లు అందజేశారని వివరించారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని 11 గ్రామసచివాలయాల పరిధిలో తొలి రోజైన బుధవారం 78 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మొత్తం 4,946 పింఛన్లు ఉండగా, 3,836 మందికి పింఛన్లు అందజేసినట్లు వివరించారు.

అన్నదాతకు ఆర్థిక సాయం



ఉదయగిరి: అర్లపడియకు చెందిన రైతు ముటుకుందు చిన్నపరెడ్డికి కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాకర్ల సురేష్ రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని బుధవారం అందజేశారు. అలాగే ఇటీవల ఓ ప్రమాదంలో గాయపడిన ఇర్ల రమణయ్యకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ వరి పంట కాలిపోయి నష్టపోయిన చిన్నపరెడ్డిని ఆదుకునేందుకు ఆర్థిక సాయం అందజేసినట్లు ఆయన తెలిపారు. గ్రామంలోని రైతుల కోసం పవర్‌స్ప్రేయర్‌ను చిన్నపరెడ్డి వద్ద అందుబాటులో ఉంచామని, అవసరమైన వారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తిరుపతిరెడ్డి, వీ మాల్యాద్రి, కిరణ్, మధురెడ్డి, పాల్గొన్నారు.

కలిగిరి: నాగసముద్రంలోని రైతుభరోసా కేంద్రానికి కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కాకర్ల సురేష్ బుధవారం పవర్ స్ప్రేయర్ అందజేశారు. అలాగే రోడ్డు ప్రమాదంలో కాలును కోల్పోయిన వీర్నకొల్లు గ్రామానికి చెందిన డేగా రాఘవేంద్రకు రూ.10వేలు సాయం అందజేశారు. ఈఓపీఆర్డీ వెలుగోటి మధు, సర్పంచ్ దమ్ము శ్రీనివాసులు, ఉపసర్పంచ్ అక్కెం హజరత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుట్టుమెషిన్ల పంపిణీ



కావలి రూరల్: పట్టణంలోని వెంగళరావునగర్‌లోని సంయుక్త సేవా సంస్థ కార్యాలయంలో ఐదుగురు పేద మహిళలకు బుధవారం కుట్టుమెషిన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ పేద మహిళల జీవనోపాధికి ఉచితంగా కుట్టుశిక్షణ అందించి కుట్టుమెషిన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర, గంధం ప్రసన్నాంజనేయులు, అజిత్, ఎంవీఎస్ ప్రసాద్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరంతో బాలిక మృతి


ఇషిత(ఫైల్)

చేజర్ల: ఆదూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న ముత్యాల ఇషిత(8) విషజ్వరంతో మంగళవారం రాత్రి మృతి చెందింది. బాలిక తల్లిదండ్రుల వివరాల మేరకు..ఆత్మకూరు మండలం వాసిలికి చెందిన నారాయణ,సుజాత దంపతులు. వారికి లోహిత, ఇషిత కుమార్తెలు. నారాయణ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కుమార్తెలను చిత్తలూరులోని అమ్మమ్మ ఇంట్లో ఉంచి ఆదూరుపల్లి ఉన్నత పాఠశాలలో చదివిస్తున్నాడు. చిన్నకుమార్తె ఇషితక గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతుండగా మెరుగైన వైద్యం కోసం చెన్నైలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఫిట్స్ రావడంతో ఇషిత మృతి చెందింది. బాలిక మృతిపై జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం శేషగిరి రావు, ఆదూరుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీరాజ్యం, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు.

వీల్‌చైర్ వితరణ



ఉదయగిరి: పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి ఎండీ తహసీన్ జ్ఞాపకార్థంగా కుటుంబసభ్యులు వీల్‌చైర్‌ను వితరణ చేశారు. సీహెచ్‌సీ డీడీఓ లీలావతికి వీల్‌చైర్‌ను బుధవారం అందజేశారు. వైద్యులు అనీసా, ఝాన్సీ, అనీస్‌సల్మా, షంషుద్దీన్, నవాజ్, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పదహారు రోజుల పండగ



ఉదయగిరి: గండిపాళెం జలాశయం ఆవరణలోని సిద్దేశ్వరస్వామి ఆలయంలో నూతన దేవతామూర్తుల విగ్రహాలను ప్రతిష్ఠించి పదహారు రోజులు పూర్తయిన సందర్భంగా బుధవారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

చిరుధాన్యాల సాగుపై దృష్టి సారించాలి



సీతారామపురం: చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టి సారించాలని డీఆర్సీ ఏడీఏ లక్ష్మీమాధవి పేర్కొన్నారు. అయ్యవారిపల్లిలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సురేఖ, ఏఈఓ నారాయణ, వీఏఏలు నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

సెబ్ ఎస్సైకు వీడ్కోలు

ఆత్మకూరు: ఆత్మకూరు సెబ్ కార్యాలయంలో ఎస్సైగా పనిచేస్తున్న మొగల్‌బాబు ఇందుకూరుపేటకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన్ని సెబ్ సీఐ బీ నయనతార ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సెబ్ ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరులకు నివాళులు



కలిగిరి: స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం నిర్వహించారు. మాదిగ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు, వెంగళరావు, శామ్యూల్, కొండయ్య, శ్రీనివాస్, మస్తాన్, సుధీర్, కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.